# పునరావృతం

"ప్రేమా! ఎవరా అబ్బాయి"

లోపలకు వెళ్లబోతున్న ప్రేమ పోర్టికోలో కూచ్చున్న తండ్రి గర్జనలాంటి గొంతు విని ఆగిపోయింది.

ఒక్కమారు తడబడి, ఆ తర్వాత మెల్లిగా జవాబు చెప్పింది.

"అతను నేను చదివే ట్యుటోరియల్ కాలేజీలో పని చేస్తున్నాడు. మాకు కూడా క్లాసులు తీసుకుంటాడు."

ప్రేమ ఎమ్.ఎస్.సి. ఎంట్రెన్స్ పరీక్షకి కోచింగ్ తీసుకుంటోంది.

"నిన్ను ఇంటి దగ్గర దింపేటంత చనువు ఎలా వచ్చింది?"

భర్త అరుపులకు లోపలనుంచి ప్రేమ తల్లి శ్యామల బయటకు వచ్చింది.

"ఏమిటలా గట్టిగా అందరికీ వినిపించేలా మాట్లాడుతున్నారు?"

"నీ ముద్దుల కూతురు మోపెడ్ వెనుక సీటుమీద కూర్చుని వచ్చిన సుందర దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్నాను. క్లాసెస్ అయ్యేసరికి కారు పంపిస్తానంటే వద్దు, మా ఫ్రెండ్స్‌తో వస్తానంది. సరేననుకున్నాను. ఇప్పుడు కారణం తెలిసింది. ఇంతకీ ఆ అబ్బాయికి వేరే జాబ్ ఏమైనా ఉందా?"

ప్రేమ "ఉద్యోగాలు దొరకడం అంత సులభంగా ఉందా డాడీ. ప్రయత్నిస్తున్నాడు. అంతవరకూ ట్యుటోరియల్ కాలేజీలో పని చేస్తున్నాడు. ఇక్కడ ఇచ్చే జీతంతో ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టడం, ఇంటర్వ్యూకి వెళ్లడం చేస్తుంటాడు. వాళ్ల నాన్నగారు రిటైర్డ్ స్కూలు టీచరు" అంది.

"ప్రయత్నాలు బాగానే చేస్తున్నాడు ఇండస్ట్రియలిస్ట్ శశిధర్ అల్లుడైతే నాలుగు కంపెనీలకి ఒకేసారి మేనేజింగ్ డైరెక్టర్ కావచ్చు."

ప్రేమ "డాడీ" అంటూ అరిచింది.

శ్యామల "ప్రేమా, నువ్వు లోపలకి వెళ్లు.

మీకు ఎనిమిది గంటలకు డిన్నర్ అపాయింట్‌మెంటు ఉంది మర్చిపోయారా" అంది.

అప్పటికి పరిస్థితిలో ప్రశాంతత వచ్చింది.

❖ ❖ ❖

మర్నాడు ఆదివారం. సాయంత్రం శ్యామల శశిధర్‌తో "మీకు వేరే పనేమీ లేకపోతే మనిద్దరమే బీచ్‌కి వెడదాం". అంది.

శశిధర్ భార్యకేసి ఆశ్చర్యంగా చూసి "అలాగే" అన్నాడు.

❖ ❖ ❖

కాలేజీ మూసేస్తున్న గంట విన్పించింది. అతని పెదవులపై చిరునవ్వు కదలాడింది. రెప్పలార్పకుండా, లోపలనుంచి వస్తున్న అమ్మాయిల గుంపులనే చూస్తున్నాడు.

అకస్మాత్తుగా అతని కళ్ళు మెరిశాయి.

లోపల నుంచి మెరుపు తీగలాంటి అమ్మాయి అతని దగ్గరగా వచ్చి "చాలా సేపైందా వచ్చి" అంది.

"అయ్యే ఉండచ్చు. ఈ మధ్యనే ఏదో సినిమా పాట వచ్చినట్లుంది. నిను చూడని క్షణమూ, నాకొక యుగమూ, నీకు తెలుసును నిజమూ."

"కవిత్వం చాలుకానీ పద బీచ్‌లో కూచుందాం."

బీచ్‌లో నడుస్తూ "ఏమైనా తిందామా" అన్నాడతను.

"నీకేం కావాలో నాకు తెలియదు కానీ నాకు సుండల్ కావాలి."

అయిస్ క్రీమ్‌లకీ, కూల్ డ్రింక్‌లకీ అతని దగ్గర డబ్బులుండవు. ఆమె ఇవ్వడం అతనికి తలవంపులుగా అన్పిస్తుంది. ఆ సంగతి ఆమెకి బాగా తెలుసు.

అతను రెండు సుండల్ పొట్లాలు తీసుకున్నాడు.

ఆమె ఇసుకలో అతని పక్కన కూచుంటూ "ఎల్లుండి నా పుట్టినరోజు. నువ్వు మా ఇంటికి పార్టీకి రావాలి" అంది.

అతని ముఖంలో ఇబ్బంది స్పష్టంగా కన్పించింది.

"నువ్వు రాకపోతే నాకు పుట్టినరోజు చేసుకున్నట్లే ఉండదు. తప్పకుండా రావాలి."

అతను మెల్లిగా "సరే" అన్నాడు.

❖ ❖ ❖

బంగళా అంతా రంగు దీపాలతో మెరిసిపోతోంది. వెయిటర్లు కూల్‌డ్రింక్స్, కేక్స్ స్వీట్లు సర్వ్ చేస్తూ హడావుడిగా తిరుగుతున్నారు.

పట్టుచీరల రెపరెపలతో, ఖరీదైన సూట్లతో తిరుగుతున్న అతిథులు సుతారంగా పదార్థాలని రుచి చూసి పడేస్తున్నారు.

ఫ్రెండు దగ్గర అరువు తీసుకున్న డ్రెస్సుతో, సైకిలు దిగేడతను.

ఒక్కసారిగా కాళ్ళు ఒణికేయి. అందరూ కార్లలో వచ్చినట్లున్నారు. నడిచి వస్తే మర్యాదగా ఉండదనుకుని అద్దె సైకిలుమీద వచ్చాడు. ఇప్పుడు లోపలికి ఎలా వెళ్లడం?

పోనీ తిరిగి వెళ్లిపోతే....

"అరె లోపలకు రా అక్కడే నిల్చున్నావేంటి" అంటూ ఆమె పరిగెత్తుకుని వచ్చింది.

"విష్‌యూ హేపీ బర్త్‌డే" అతను చిన్న పాకెట్ ఆమె చేతిలో పెట్టేడు.

"డాడీ, ఇతను... "తండ్రికి పరిచయం చెయ్యబోయిందామె.

"మీ నాన్నగారు ఏం చేస్తుంటారు" కఠినంగా ఉంది తండ్రి గొంతు.

తడారిపోయిన కంఠంతో జవాబు చెప్పేడతను "టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నారు."

ఆమె ఉత్సాహంగా "ఎస్.ఎస్.ఎల్.సి. నేను డింకీ కొట్టినప్పుడు ఇంట్లో తోచడం లేదని టైపు క్లాసెస్‌కి వెళ్లేనుగా. అక్కడే పరిచయమైంది. నేను నేర్చుకుంటున్నప్పుడు ఇతను టైపు హయ్యర్ క్లాసెస్‌కి వచ్చేవాడు. షార్టుహేండ్‌లో కూడా పరీక్షలన్నీ పాసయ్యాడు" అంది.

"సరే నువ్వు లోపలకు వెళ్ల మిగతా గెస్టుల సంగతి చూడు. ఇదిగో అబ్బాయ్ ఎలాగూ వచ్చావుగా టిఫిన్ తినేసి వెళ్లు."

అతనికి కోపంతో కళ్ళు ఎరుపెక్కేయి.

"చాలా థాంక్స్ చెడుతున్నాను. ఇంకోసారి మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ దిడే" వడివడిగా, సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

భుజంమీద చెయ్యి పడేసరికి ఉలిక్కిపడ్డాడు శశిధర్. శ్యామల అతని భుజం మీద చెయ్యివేసి, చిరునవ్వు నవ్వుతోంది.

"ఈ బీచ్‌ని, ఎదురుగా ఉన్న కాలేజీని చూసేసరికి గతమంతా జ్ఞాపకం వచ్చిందా? ముప్పై సంవత్సరాల క్రిందట సంఘటనలు జ్ఞాపకం రావడం లేదూ. ఆనాడు నా పుట్టినరోజునాడు మిమ్మల్ని మాడాడీకి పరిచయం చేసి, ఆయన అంగీకారంతో మిమ్మల్ని వివాహం చేసుకుందామనుకున్నాను.

అదేరోజున వచ్చిన అతిథులందరిముందూ ఒక జమీందారు కొడుకుతో నా ఎంగేజిమెంటు అనౌన్స్ చెయ్యాలని డాడీ అనుకున్నారు.

అందుకే అప్పటికప్పుడే ఇల్లు వదిలి వచ్చేశాను.

"మీ ఆత్మ విశ్వాసం, ఏదైనా సాధించాలన్న కోరిక. సాధించి తీరగలనన్న నమ్మకమూ, దీక్షా నన్నెంతో ఆకర్షించాయి. అందుకే మీతో జీవితం పంచుకుందుకు అప్పటికప్పుడే వచ్చేశాను. అద్దె సైకిలూ, అరువు బట్టలూ నాకు అడ్డుగా నిలవలేదు"

శశిధర్ అర్థమైనట్లుగా తల ఊపాడు.

"ఈనాడు అదే పరిస్థితి. ఎవరో ఫ్రెండు దగ్గర తీసుకున్న మోపెడ్‌మీద ట్యుటోరియల్ కాలేజీలో టెంపరరీ జాబ్ చేస్తున్న కుర్రాడు. రిటైర్డు స్కూల్ టీచర్ కొడుకు ప్రేమని ఇంటిదగ్గర దింపేడు. చరిత్ర పునరావృతమౌతోంది."

❖ ❖ ❖

ప్రేమ దిగాలుగా చూస్తూ "నవీన్, ఏం చెయ్యాలో తెలియడం లేదు. మా డాడీ మన పెళ్లికి ఒప్పకోరు" అంది.

"నా మాట మీద ఏమాత్రం నమ్మకమున్నా అప్పటికప్పుడే నాతో వచ్చెయ్యి. విలాసాలు లేకపోవచ్చు కానీ నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటాను. ఇంకో నాలుగు ట్యూషన్లు చెప్పయినా నిన్ను పోషించగలను."

"అంతటి అవసరం కూడా రాకపోవచ్చు" గంభీరమైన కంఠం విని, నవీన్, ప్రేమా తిరిగి చూశారు.

శశిధర్ నవ్వుతూ నిల్చున్నాడు.

"నీ గురించి మొత్తం తెలుసుకున్నాను నవీన్. నీ తెలివితేటలూ, ఆత్మవిశ్వాసమూ, పట్టుదలా నిన్ను ట్యూషన్ల దగ్గర నిలిపివెయ్యవు. నువ్వు తప్పకుండా పైకి వస్తావు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నిన్ను చూసినా నాకు ఆశ్చర్యం కలగదు."

ప్రేమ చేతిని నవీన్ చేతిలో పెట్టాడు శశిధర్.

ఇద్దరూ ఆనందంగా శశిధర్‌కి నమస్కరించారు.

చరిత్ర పునరావృతం కానందుకు శ్యామల ఆనందంతో పొంగిపోయింది దూరం నుంచే జరిగిందంతా చూస్తూ.

(ఆంధ్రభూమి మంత్లీ)